క్లుప్తంగా

ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా?



మహాముత్తారం: మహాముత్తారం గ్రామ పంచాయతీ పరిధిలోని రెండవ వార్డులో ప్రధాన వీధిలోని మూలమలుపు వద్ద విద్యుత్ స్తంభానికి మరో విద్యుత్ స్తంభం వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. కొన్ని నెలలుగా ఇలాగనే ఉండటంతో వర్షాకాలంలో ఈదురు గాలులు వచ్చినప్పుడు అటు ఇటు ఊగుతూ విద్యుత్ వైర్లు ఒకదానికి ఒకటి తగిలి మంటలు చెలరేగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అధికారులకు చెప్పిన పట్టించు కోవడంలేదని వార్డులోని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదం జరుగక ముందే వేలాడుతున్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని కోరుతున్నారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ



కాటారం: ఎస్సీ వర్గీకరణ ధ్యేయంగా హైదరాబాద్‌లోని పేరేడ్ గ్రౌండ్స్‌లో ఈ నెల 11న నిర్వహించనున్న విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంథని చిరంజీవి కోరారు. మండల కేంద్రంలో గురువారం మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మండంలోని అన్ని గ్రామాల ఎమ్మార్పీఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ చంద్రగిరి అశోక్, మంథెన శ్రీనివాస్, వెంకటేశ్, సంతోష్, రఘు , బాపు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



శాయంపేట : మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతం కన్నుల పండుగగా జరిగింది. అర్చకుడు మార్త రాజకుమార్ వేదమంత్రోచ్చారణల మధ్య వ్రతాన్ని నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాసాని సూర్యప్రకాష్, భక్తులు ఆదిరెడ్డి, చంద్రమౌళి మహిళలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



శాయంపేట : ఎన్నికల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ అన్నారు. మండలంలోని పెద్దకోడెపాకలో గురువారం మోడల్‌కోడ్‌ఆఫ్‌కండక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ రవీందర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలనేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి గొడవలు జరగకుండా ప్రజలు సంయమనం పాటించాలన్నారు. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం, డబ్బులు పంపిణీ చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే ఎలక్షన్ కమిషన్ ఏర్పాటు చేసిన 1950కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిషోర్‌కుమార్, సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్ పాల్గొన్నారు.

పరామర్శ



శాయంపేట : ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అత్తమ్మ రొండ్ల విజయమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రం అశోక్, మండల అధ్యక్షుడు గంగుల మనోహర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణరెడ్డిలు ఆమె చిత్రపటానికి పూల మాల వేసి నివాళ్లర్పించారు. ఆయన వెంట ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..



భూపాపల్లి రూరల్: పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజయ్య, సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందని మాజీ ఎంపీ రాజయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో పలు పార్టీలకు నుంచి కాంగ్రెస్‌లో చేరడంతో వారిని రాజయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి సత్యనారాయణరావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

గణపురం: మండలంలోని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారయణరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చెల్పూరు మాజీ సర్పంచ్ కొత్త పద్మ వెంకన్న, గణపురం మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ, బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జ గంగాధర్ రావుతో పాటు పలువురు సుమారు 200 మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రేపాక రాజేందర్, వైస్ ఎంపీపీ విడిదినేని అశోక్, నాయకులు దూడపాక శంకర్ తదితరులు వున్నారు.

రేగొండ: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పట్టెం శంకర్, భాగిర్థిపేట గ్రామం నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా వారికి మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య, సత్యనారాయణరావు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నరసయ్య, ఉప సర్పంచ్ తిరుపతి నాయకులు మేకల బిక్షపతి,సుదర్శన్, దేవెందర్, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మహాముత్తారం: మండలంలోని నల్లగుంటపీఎనాజీపేట, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి మంథని ఎమ్మెల్యే శ్రీదర్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంట దేవేందర్‌రెడ్డి, ఓలపు శంకర్‌పటేల్, మోత్కూరి రవి, లింగమల్ల దుర్గయ్య, తాటి లచ్చయ్య, రత్నం సదువలి, నజీర్‌ఖాన్ తదితరులు ఉన్నారు.



మహాముత్తారంలో..

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



చిట్యాల: పార్టీలో చేరిన నాయకులతో వెంకటరమణారెడ్డి



టేకుమట్లలో..

టేకుమట్ల: మండలంలోని వెల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ యువ నాయకుడు గండ్ర గౌతమ్‌రెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీలో చేరారు. కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు దుస్సా రవి, యూత్ నాయకులు మహేందర్, సీనియర్ నాయకులు కొండయ్య, సారయ్య, రాజయ్యతో పాటు 25 మంది కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారిని కండువా కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సట్ల రవి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మండల నాయకులు పాల్గొన్నారు.

చిట్యాల: మండల కేంద్రంలోని కాంగ్రెస్, బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బుర్ర రఘు, అముదాలపల్లి శ్రీనివాస్, గాజర్ల మల్లేష్, నేపాలి రాకేష్, గోల్కొండ అజయ్, చిలుముల అజయ్, బండి రాజు, గుండ వెంకటేష్, గాజర్ల అఖీల్, రమేష్, ఎండి సాజీత్‌లు చేరగా వారిని కండవాలు కప్పి ఆహ్వానించారు. సీనియర్ నాయకులు కొత్తూరి రాజిరెడ్డి, బుర్ర శ్రీధర్, తొటం నవీన్, బుర్ర రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహదేవపూర్: మండంలోని పెయింటార్ అసోసియేషన్ నాయకులు గురువారం బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్‌ఎస్ పార్టీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టమధు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'బీఆర్‌ఎస్ నాయకులనే చేర్పించుకుంటున్నారు'



సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌గౌడ్

టేకుమట్ల: మండలంలోని బీఆర్‌ఎస్ నాయకులు వారి పార్టీల వారికే కండువాలు కప్పి.. కాంగ్రెస్ చెందిన నాయకులు చేరుతున్నారని సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కోటగిరి సతీష్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎప్పుడు ఎక్కడికి వెళ్లరని గండ్ర సత్యనారాయణరావు నాయకత్వాన్ని బలపరుస్తూ ముందుకు సాగుతామని అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఇలాంటి తప్పుడు సమాచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శంకర్ గౌడ్, వంగ కుమారస్వామి, సట్ల కోంరయ్య, రాజిరెడ్డి, సాంబయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

చిట్యాల: మండలంలోని పాసిగడ్డతండా గ్రామ శివారులో గుడుంబాను తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు గురువారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఎస్సై జంగిలి రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాశిగడ్డతండా గ్రామానికి చెందిన లావుడ్య రాజు, లావుడ్య తిరుపతి మోరంచపల్లి గ్రామ శివారులో గుడంబా తయారు చేస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసి 25 లీటర్ల గుడంబాను స్వాధీనం చేసుకుని, 9వందల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడులలో సీసీఎస్ ఎస్సైలు శ్రావణ్, భాస్కర్‌రావు, పోలీస్ సిబ్బంది నవీన్, సురేందర్, రవి, తదితరులు పాల్గొన్నారు.

కీర్తిరెడ్డిని గెలిపించాలి



ఓటు అభ్యర్థిస్తున్న నాయకులు

భూపాలపల్లి రూరల్: నియోజకవర్గ ఎమ్మెల్యేగా బీజేపీ అభ్యర్థి చందుపట్ల కీర్తిరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ అర్బన్ అధ్యక్షుడు సామల మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని రెడ్డి కాలనీ 30వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. భూపాలపల్లిలో కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. చందుపట్ల కీర్తిరెడ్డి గెలుపు ద్వారా సింగరేణి, జెన్‌కో, కుటుంబాల పిల్లలకు మైనింగ్, ఇంజనీరింగ్ కళాశాలలు తీసుకురావడానికి కీర్తిరెడ్డి కృషి చేస్తారని వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ అర్బన్ ప్రధాన కార్యదర్శి తుమ్మేటి రామ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు కోరే సుధాకర్, నాయకులు మునీందర్, జయపాల్ రెడ్డి, నాంపల్లి కుమార్, కంబాల రాజయ్య, బూత్ అధ్యక్షుడు రవి నాయక్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీని ఆదరించండి

ములుగు: నిరుపేదల కోసం పని చేస్తున్న బీఎస్పీని ప్రజలు ఆదరించాలని ఆ పార్టీ నియోజవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్యా జంపన్న నాయక్ కోరారు. జిల్లా కేంద్రంలో పలువురు యువ నాయకులు పార్టీలో చేరగా కండువా కప్పి ఆహ్వానించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు దొరల పాలనలో అనచివేయబడ్డారని ఆరోపించారు. పార్టీ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ అధికారంలోకి రాగానే బహుజన వర్గాలకు అన్ని రకాలుగా అండగా ఉంటారని అన్నారు.

బీజేపీ నాయకుల సంబురాలు



టపాకాయలు కాల్చుతున్న బీజేపీ నాయకులు

మహాముత్తారం: బీజేపీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల సునీల్‌రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడంతో నాయకులు గురువారం మండలంలోని యామన్‌పల్లి ప్రధాన కూడలి వద్ద టపాకాయలు కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు సంపత్‌కుమార్, పూర్ణచందర్, రమణాకర్, యువ మోర్చా మండలాధ్యక్షుడు శ్రీకాంత్, గిరిజన మోర్చ మండలాధ్యక్షుడు అంజిబాబు, మహిళా అధ్యక్షురాలు కవిత, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేస్తున్న అభినవ్

కన్నాయిగూడెం: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని వైద్యుడు అభినవ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అభినవ్ గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లను పంపిణీ చేశారు. గర్భిణులకు రక్త సమస్యలు తలెత్తకుండా శిశువుకు సరైన పోషకాలు అందడంలేదనే ఉద్దేశ్యంతో పోషక విలువలతో కూడిన కిట్లను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

దొంగతనాలను ఛేదించిన పోలీసులు



అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాటారం: కాటారం మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లో ఇటీవల జరిగిన వరుస దొంగతనాలను పోలీసులు ఛేదించారు. మంచిర్యాలకు చెందిన చింతకింది సతీశ్ అనే దొంగను అరెస్ట్ చేశారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ రంజిత్‌రావు వివరాలను వెల్లడించారు. అక్టోబర్ 22, 23 తేదీల్లో మండల కేంద్రంలోని ఆదర్శనగర్‌లోని రేపాల వేణుగోపాల్, ముస్కుల సురేందర్‌రెడ్డి ఇంట్లో దొంగతనాలు జరిగాయి. బాధితుల సమాచారం మేరకు రంగంలోకి దిగిన కాటారం ఎస్సై అభినవ్, సిబ్బంది క్లూస్ టీం, ఫింగర్ ఫింట్స్, ఐటీ కోర్ ద్వారా వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజ్, ఫింగర్‌ఫ్రింట్ ఆధారాలతో విచారణ కొనసాగించిన పోలీసులు నిందితుడు సతీష్‌ను పట్టుకున్నారు. నిందితుడి దగ్గర నుంచి తులం బంగారం విలువ కల్గిన మూడు చైన్లు, మూడు గ్రాముల చెవి కమ్మలు, 180 గ్రాముల సిల్వర్ పట్టీలు, ఒక సెలిఫోన్ స్వాధీనపర్చుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్సై అభినవ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్సై-2 సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

పాపం పండింది

ఐదుగురు అటవీశాఖ అధికారుల సస్పెన్షన్

కాటారం: స్థానికంగా కట్టెకోత మిషన్లు ఎన్ని నడిచినా వారు పట్టించుకోరు.. కానీ ఓ సామాన్య వ్యక్తి ఇంటి నిర్మాణంలో భాగంగా కలప తెచ్చుకున్నా వారు సహించరు.. అజ్ఞాత వ్యక్తులు సమాచారం ఇచ్చారంటూ ఇళ్ల నిర్మాణం చేసుకునే వారి వద్దకు చేరుకొని రూల్స్ మాట్లాడుతారు.. ఆ తర్వాత నిబంధనలను పాతర పెట్టి సెటిల్‌మెంట్‌కు పాల్పడుతారు.. పేదవారి వద్ద నుంచి కూడా వేలాది రూపాయలు దండుకున్న కాటారం రేంజ్ అధికారుల పాపం పండింది. మండలంలోని దంతాపల్లికి చెందిన శ్రీనివాస్ తన పట్టాభూమిలోని టేకు చెట్లను నరికి తరలించడానికి అటవీశాఖ అధికారులను సంప్రదించారు. తమకు కొంత మొత్తంలో డబ్బులు ఇవ్వడంతో పాటు పీఓఆర్ రూ.9104 చెల్లిస్తే ఏ సమస్య ఉండదని సూచించారు. దీంతో బాధితుడు శ్రీనివాస్ పీఓఆర్ చెల్లించడంతో పాటు ఐదుగురు అధికారులకు లంచంగా కొంత మొత్తం ఇచ్చాడు. చెట్లను నరికి ఎడ్లబండ్లలో ఇంటికి తీసుకెళ్తున్న తరుణంలో సదరు అటశాఖ అధికారులు పట్టుకొని కలప దుంగలను అటవీశాఖ డిపోకు తరలించారు. అధికారులు చెప్పినట్లుగా నిబంధనల ప్రకారం ఫీజు చెల్లించినప్పటికీ కలపను ఎలా పట్టుకుంటారని బాధితుడు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ జరిపిన ఉన్నతాధికారులు కాటారం ఇన్‌చార్జ్ రేంజ్ అధికారి మధుబాబు, డీఆర్‌ఓ హరిప్రియ, ఎఫ్ఎస్ఓ సతీశ్, ఎఫ్‌బీఓ అనిల్, మంజులను సస్పెండ్ చేసినట్లు మహదేవపూర్ ఎఫ్‌డీఓ వజ్రారెడ్డి తెలిపారు.

పల్లెల ప్రగతి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యం

ఏటూరునాగారం: పల్లెలు ప్రగతి చెందాలి అంటే బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి, జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీ నర్సింహారావు అన్నారు. గురువారం మండలంలోని రొయ్యూర్, శంకరాజుపల్లి, చెల్పాక, అల్లం వారిఘణపురం గ్రామాల్లో కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా ప్రచారాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలో తెలంగాణకు ఒరేగబెట్టింది ఏమిలేదన్నారు. సామాన్య ప్రజలకు అండగా ఉన్నది కేసీఆర్ ప్రభుత్వమే అన్నారు. కార్యక్రమంలో రోడ్లు, భవనాల చైర్మన్, మండల ఇన్‌చార్జ్ మెట్టు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు గడదాసు సునీల్, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ వలియాబీసలీం, ఎంపీపీ అంతటి విజయ నాగరాజు, ఎంపీటీసీలు జాడి లక్ష్మీనారాయణ, కోట నర్సింహులు, సర్పంచ్‌లు జెట్టి ఈశ్వర్, అనుముల శకుంతల, నాయకులు మల్లారెడ్డి, మహేష్, ఖాజాపాషా పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే హామీల అమలు

ములుగు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని ఆ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్ అన్నారు. ఈ మేరకు గురువారం గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని జగ్గన్నగూడెం, రాయినిగూడెం, పంచోత్కులపల్లి, కొత్తూరు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్ల , నిధులు, నియామకాల పేరుతో సాధించుకున్న రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల్ల భరత్‌కుమార్, అభినయ్, దేవేందర్, మహేందర్ ఉన్నారు.

వెలవెలబోతున్న ఆశ్రమ పాఠశాల

- సెలవులు ముగిసి వారం రోజులు
- ఇప్పటికీ రాని విద్యార్థులు



తాళాలు వేసి ఉన్న పాఠశాల గదులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని కొడిశాలలోని గిరిజన ఆశ్రమ పాఠశాలకు విద్యార్థులు రాక వెలవెలబోయింది. దసరా పండుగ తర్వాత పాఠశాలలు పునర్‌ప్రారంభమైన ఎనిమిది రోజులు గడిచిన ఒక విద్యార్థి కూడా పాఠశాలకు హాజరు కాలేదు. దీంతో పాఠశాల బోసిపోయి కనిపిస్తుంది. పాఠశాలలో 3వతరగతి నుంచి పదోవ తరతగతి ఉండగా మొత్తం 120 మంది విద్యార్థులు ఉన్నారు. దసరా పండుగ సందర్భంగా ప్రభుత్వం పాఠశాలలకు అక్టోబర్ 24 వరకు సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. తిరిగి పాఠశాలలు ప్రారంభమైన గురువారం వరకు విద్యార్థులు ఒకరు కూడా రాలేదు. సెలవుల్లో పాఠశాల తరగతి గదులకు వెసిన తాళాలు వెసినట్టే ఉన్నాయి. పాఠశాలలకు ఉపాధ్యాయులు హాజవుతున్నారు. పదోవతరగతి విద్యార్థులు కూడా ఇప్పటి వరకు రాకపోవడంతో సిలబస్ కూడా పూర్తియ్యే పరిస్థితి లేదు. విద్యార్థులను తీసుకురావాడానికి వారి ఇళ్లకు వెళ్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. పాఠశాలలో ఒక్క ఉపాధ్యాయుడు మాత్రమే ఉండగా మిగిత ఉపాధ్యాయులపై ఆరా తీయగా పిల్లలను తీసుకురావాడానికి వెళ్లారని చెప్పారు. పాఠశాల తెరిచి ఎనిమిది రోజులువుతున్నా విద్యార్థులు రాకపోవడంపై గిరిజన సంక్షేమ శాఖ అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. అధికారులు ఐటీడీఏ కార్యాలయంలోని ఆఫీసులకు మాత్రమే పరిమితమవుతున్నారే తప్ప పాఠశాలలను సందర్శించి విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించిన దఖాలాలు లేవని విమర్శలు వినిపిస్తున్నాయి. కొడిశాల పాఠశాల మారుమూల గ్రామంలో ఉన్నందునే అధికారులు పట్టించుకోవడం లేదని, విద్యార్థులకు సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

అధ్వానంగా మరుగుదొడ్లు



అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు

పాఠశాలలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు పూర్తి మరమ్మతులకు వచ్చి నిరూపయోగంగా మారాయి. పాఠశాలలోని విద్యార్థులు, స్నానాలకు, మాలమూత్ర విసర్జన కోసం ఇబ్బంది పడాల్సి వస్తుంది. గిరిజన పాఠశాలల్లో అనేక సౌకర్యాలను కల్పిస్తున్న గొప్పలు చెబుతున్నా అధికారులు పాఠశాలల్లోని సౌకర్యాలను పట్టించుకున్న వారే కరువాయ్యారు. పాఠశాలలో మరుగుదొడ్లు మరమ్మతులు వచ్చిన విషయం అధికారులకు తెలిసిన పట్టించుకోకపోవడం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగుదొడ్లకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది.

ట్రాక్టర్ పైనుంచి పడి విద్యార్థి మృతి

మంగపేట: మండలంలోని మల్లూరు గ్రామానికి చెంది వట్టం మనోజ్(18) ఇంటర్ విద్యార్థి ట్రాక్టర్ ప్రమాదంలో గురువారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లూరు గ్రామానికి చెందిన వట్టం ముత్తయ్య, ధనలక్ష్మి దపంతుల మూడవ కుమారుడైన మృతుడు మనోజ్ ఏటూరునాగారం గురుకుల రెసిడెన్సియల్ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నాడు. దసరా పండుగ సెలవులకు ఇంటికి వచ్చినట్లు సమాచారం. కాగా నర్సింహసాగర్ నుంచి ట్రాక్టర్‌లో వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించే క్రమంలో మృతి చెందగా యువకుడి మృతదేహాన్ని ఏటూరునాగారం ఏరియా ఆస్పత్రి తీసుకెళ్లినట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై రవికుమార్‌ను వివరణ అడుగగా సంఘటన జరిగినట్లు సమాచారం తెలిసిందని ఎవరుకూడా ఇంకా ఫిర్యాదు చేయలేదని, విచారణ చేస్తున్నామని పూర్తి వివరాలను నేడు(శుక్రవారం) వెల్లడిస్తామన్నారు.